క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



మక్తల్: నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి మంగళవారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. మక్తల్ మండలం పంచలింగాల గ్రామానికి చెందిన సిదార్థరెడ్డికి రూ.30 వేలు, ఖానాపూర్‌కు చెందిన బోయే ఆనంద్‌కు రూ.38,400 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, నగేశ్, ఆనంద్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలి



మరికల్: గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ కోరారు. మంగళవారం హనుమాన్‌వాడ కాలనీలో సీసీరోడ్డుపై నిలిచిన మురుగును ఆయన పరిశీలించారు. అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టకపోవడంతో రహదారులు, ఇళ్ల మధ్య మురుగు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. విష జర్వాలు ప్రబలకముందే పంచాయతీ కార్యదర్శి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్, వెంకటేష్, శివ, శ్రీరామ్, నిఖిల్ పాల్గొన్నారు.

బకాయి వేతనాలు విడుదల చేయండి

నారాయణపేట రూరల్: గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలని కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు నరసింహ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వేతనాలు అందక జీపీ కార్మికులకు కుటుంబ పోషణ భారంగా మారిందని, కనీస అవసరాలు తీర్చుకోవడం కష్టంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

50వ రోజుకు రిలే దీక్షలు

నారాయణపేట: పేట-కొడంగల్ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు భూ పరిహారం పెంచాలని డిమాండ్ చేస్తూ భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు ముందు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి 50వ రోజుకు చేరుకున్నాయి. 50 రోజులుగా దీక్షలు చేస్తున్న ప్రభుత్వం దిగిరాకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు దీక్షలు ఆపమన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

ఊట్కూరు: మండలంలోని పగిడిమారి, ఓబులాపూర్ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ప్రత్యేకాధికారి యోగానంద్ మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో మంగళవారం బీజేపీ బూత్ అధ్యక్షుడు సంజీవ్ ఆధ్వర్యంలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ ఎంపీ నిధులతో లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిజేపి నాయకులు నర్సింహులు, నాగేష్, కొండనగోపాల్ పాల్గొన్నారు.

యువకుడిపై కోతుల దాడి

మద్దూరు: వానరుల దాడిలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణానికి చెందిన ఖురేషీ అబ్దుల్లా (20) ఇంటి వద్ద కూర్చొని ఉండగా కోతుల గుంపు ఇంటి కాంపౌండ్‌లోకి వచ్చే క్రమంలో వాటిని నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో అబ్దుల్లాపై వానరాలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే అబ్దుల్లాను స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ భవనం.. నిరుపయోగం

- జనవరి 10న ప్రారంభోత్సవ శిలాఫలకం
- ఇంత వరకు ప్రారంభానికి నోచుకోని భవనం
- అద్దె భవనంలో జీపీ సేవలు



నిర్మాణం పూర్తైనా నిరుపయోగంగా ఉంచిన పంచాయతీ భవనం

దామరగిద్ద: ప్రజల సౌకర్యార్థం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు.. అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. మండలంలోని క్యాతన్‌పల్లి గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించారు. రెండేళ్ల క్రితమే పనులు కూడా పూర్తి అయ్యాయి. పనులు పూర్తి అయినప్పటికీ అధికారులు మాత్రం భవనాన్ని ప్రారంభించకుండా అద్దె భవనంలోనే పంచాయతీ సేవలు కొనసాగిస్తున్నారు. గతేడాది జనవరి 10న జీపీ భవనం, ఆరోగ్య కేంద్రం భవనాల ప్రారంభోత్సవం చేసేందుకు కాంట్రాక్టర్ అరవింద్ ఎమ్మెల్యేను సంప్రదించగా ఎమ్మెల్యే సమయం ఇచ్చిన తేదీన ప్రారంభోత్సవానికి శిలాఫలకాన్ని ఏర్పాటుచేశారు. స్థానిక ఎమ్మెల్యే సమయం ఇచ్చి హాజరుకాక పోవడంతో అదే రోజున జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానిక సర్పంచ్‌లతో భవనాన్ని ప్రారంభించినట్లు సదరు కాంట్రాక్టర్, స్థానిక నాయకులు తెలియజేశారు.

ప్రారంభించ లేదంటున్న అధికారులు

నూతన పంచాయతీ భవనం నిరుపయోగంగా ఉందంటూ అధికారులను వివరణ కోరగా గ్రామ పంచాయతీ భవనం ప్రారంభానికి ఎంపీ, ఎమ్మెల్యేలు సమయం ఇచ్చేందుకు తేదీలు ఖరారు కాలేదని ఇరువురి తేదీలు ఖరారు కాగానే ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనం అధికారులు, ప్రజా ప్రతినిధుల తీరుతో నిరుయోగంగా మారింది.



జీపీ నిర్వహణకు అద్దెకు తీసుకున్న భవనం

అద్దెభవనంలో జీపీ సేవలు

నూతన భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో కొన్నాళ్లుగా స్థానిక ప్రాథమిక పాఠశాల భవనంలో పంచాయతీ కార్యాలయాన్ని కొనసాగించారు. స్థానికుల ఫిర్యాదుతో అక్కడి నుంచి ఓ అద్దె భవనంలోకి మార్చగా గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రస్తుతం అద్దె భవనం నుంచే తన విధులను కొనసాగిస్తున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం



నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించలేదు. పనుల జాతర కార్యక్రమంలో ప్రారంభోత్సవం చేసేందుకు సిద్ధమైన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు అందుబాటులో లేకపోవడంతో ఇంతవరకు ప్రారంభించలేదు. ఎంపీ ఎమ్మెల్యేలు సమయం ఇవ్వగానే త్వరలోనే ప్రారంభోత్సవం చేపట్టిన వినియోగంలోకి తీసుకొస్తాం.

–సాయిలక్ష్మి, ఎంపీడీఓ, దామరగిద్ద

నిమజ్జనానికి తరలిన గణనాథుడు



గణనాథుడిని దర్శించుకున్న ఆర్టీఓ మేఘా గాంధీ

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని ఆర్టీవో అడ్వైజర్స్ ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు పూజలందుకున్న గణనాథుడని మంగళవారం నిమజ్జనానికి తరలించారు. గణనాథుడికి ఆర్టీఓ మేఘా గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలంలో లడ్డును రూ.16 వేలకు దక్కించుకున్న శరత్‌కుమార్‌కు ఆర్టీఓ చేతుల మీదుగా అందజేసి శాలువాతో సన్మానించారు. ఆఫీస్ సిబ్బంది విద్యాసాగర్, సృజన్ భాస్కర్, ఆర్టీవో అడ్వైజర్స్ పాల్గొన్నారు.

38 రకాల వంటకాలతో నైవేద్యం

జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ యువజన సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపయ్యకు 38 రకాల వంటకాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎస్ఐ ప్రత్యేక పూజలు

మండలంలోనీ ఏక్లాస్ పూర్ గ్రామంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని ఎస్ఐ వెంకటేశ్వర్లు దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడానికి గ్రామంలో ఒకే విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని అభినందించారు.

ఘనంగా వినాయక పూజలు

ఊట్కూరు: పట్టణంలోని పాతపేట వీధిలో ప్రతిష్ఠించిన గణనాథుడిని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గరిడి నింగిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భరత్, రవికుమార్, మురళీ, యజ్ఞేశ్వర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.



నైవేద్యం సమర్పిస్తున్న మహిళలు

దామరగిద్ద: మండలంలో దామరగిద్ద మద్దెల్‌బీడ్ తదితర గ్రామాల్లో వినాయక మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు పూజలు నిర్వహించారు.

గణనాథుడిని దర్శించుకున్న ఎంపీ

మద్దూరు: పట్టణంలో ప్రతిష్ఠించిన 35 అడుగుల భారీ వినాయకుడిని పాలమూరు ఎంపీ డీకే అరుణ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.



వినాయకుడికి హారతి ఇస్తున్న ఎంపీ డీకే అరుణ

‘చిట్టెంను విమర్శించే స్థాయి లేదు’



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మక్తల్: మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని విమర్శించే హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు చిన్నహన్మంతు, బీఆర్ఎస్ నాయకుడు అన్వర్ హుసేన్ అన్నారు. మంగళవారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. దమ్ముంటే నియోజకవర్గంలో యూరియా కొరతను తీర్చాలన్నారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే అవగాహన లేకుండా మాట్లాడటం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో లబ్ధి పొంది తీరా ఇప్పుడు ఆయననే విమర్శించడం సరికాదన్నారు. రామన్న దయ దాక్షిణ్యంతో లబ్ధిపొందిన విషయం మర్చిపోవద్దన్నారు. గతంలో మక్తల్ నియోజకవర్గాన్ని ఎంత అభివృద్ధి చేశామో చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. తమ స్థాయికి తగ్గ పనులు చేయాలని హెచ్చరించారు. సమావేశంలో జుట్లశంకర్, వివారెడ్డి, గుంటి రఘు, మహమూద్, మనస్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయించండి



ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందిస్తున్న గ్రామ నాయకులు

కృష్ణా: మండలంలోని ఐనాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో పాటు రైల్వేమోరి కింద నీళ్లు నిలుస్తుండడంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వెంటనే రోడ్డుకు మరమ్మతు చేయించాలని స్థానిక నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీ డీకే అరుణను కలిసి వినతి పత్రం అందజేశారు. గుంతలమయమైన రోడ్లతో ఏళ్లుగా అవస్థలు పడుతున్నామని, వెంటనే రోడ్డును బాగు చేయించాలని కోరారు. ఎంపీ స్పందిస్తూ సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మంజునాథ్ స్వామి, బసిరెడ్డి, బీజేపీ అధ్యక్షుడు నర్సప్ప, నియోజకవర్గ నాయకుడు బల్‌రాంరెడ్డి, జయానంద్‌రెడ్డి ఉన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మరికల్: రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని మండల బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ రాంకోటి, ఏఓ రహ్మాన్‌కు వినతిపత్రం అందజేశారు. నెల రోజుల నుంచి యూరియా కోసం రైతులు రాత్రి, పగలు తేడా లేకుండా ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే రైతులకు సరిపడా యూరియాను దిగుమతి చేసుకోవాలన్నారు. అలాగే యాసంగికి సంబంధించిన బోనస్ డబ్బులను కూడా రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సురేఖ, తిరుపతయ్య, బసంత్, మల్లేష్, కృష్ణారెడ్డి, రామస్వామి, విష్ణు,రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

నారాయణపేట రూరల్: పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ లింగయ్య తెలిపారు. పట్టణంలోని బాలాజీ మందిర్ గణనాథుని మంగళవారం ఆయన దర్శించుకుని అన్నదానాన్ని ప్రారంభించారు. అదేవిధంగా మండలంలోని కోటకొండ లో ఏర్పాటుచేసిన గణనాథులకు పూజలు నిర్వహించారు. అనంతరం కోటకొండ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిమజ్జనానికి చెరువు దగ్గర క్రేన్ ఏర్పాటు చేయాలని కోరుతూ డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో ప్రతిష్ఠించిన ఏకైక వినాయకుడిని టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు.

శోభాయాత్ర ఏర్పాట్ల పరిశీలన

ఊట్కూరు: వినాయక శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ లింగయ్య సూచించారు. మంగళవారం ఊట్కూరులో గణేష్ నవరాత్రి సందర్భంగా గణేష్ శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించారు. శోభాయాత్రలో ట్రాఫిక్ ఏర్పాట్లు, పెద్ద చెరువు దగ్గర క్రేన్ ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం



మక్తల్‌లో వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పాథర్చేడ్‌లో వైఎస్ఆర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

నర్వ: ఉమ్మడి ఏపీలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేటికి ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడుగా నిలిచిన మహానేత వైఎస్ఆర్ అని కర్ని గంగాధర్ అన్నారు. పాథర్చేడ్‌లో వైఎస్ఆర్ 16వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్సీపీ నాయకులు వెంకటయ్య, నాగర్జున్‌రెడ్డి, ఉప సర్పంచు కృష్ణయ్య, పెద్ద మల్లేష్, మైబు, బోలుబండ వెంకటేష్, రాఘవేందర్‌గౌడ్, రవి, శ్రీహరి, అశోక్ పాల్గొన్నారు.

నాయకుల ఘన నివాళి

మక్తల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని మక్తల్ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్ అన్నారు. పట్టణంలో మంగళవారం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేసకుమార్, రవికుమార్, నాగేందర్, ఫయాజ్, గోవర్ధన్, శ్రీనివాసులు, గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు ఎమ్మెల్యే వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట/ధన్వాడ: మండలకేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు నూతన భవనాన్ని మంజూరు చేయాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మంగళవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధి పనులపై నివేదిక అందజేశారు. ఈ సందర్భంగా ధన్వాడలో ఎస్సీ బాలుర వసతి గృహానికి నూతన భవనాన్ని మంజూరు చేయాలని, నియోజకవర్గంలోని రోడ్డు కనెక్టివిటీ లేని తండాలకు రోడ్లు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి త్వరలో నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

‘స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం’

నారాయణపేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామని మాజీ ఎంపీపీ అమ్మకొళ్ళ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు రాములుతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలలకే అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. ఇంతవరకు నారాయణపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పాలనలో అప్పటి ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన అభివృద్ధే తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క అభివృద్ధి కూడా పని చేయలేదన్నారు. ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగి పోయారని రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టడం ఖాయమన్నారు. సమావేశంలో నాయకులు రాములు,భగవంతు,కుమ్మరి రాములు,జలాల్ పూర్ చెన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

గడువులోగా సర్వే పూర్తి చేయాలి

నర్వ: పాఠశాలలో మౌళిక సదుపాయాల కల్పనపై నిర్వహించే సర్వేను గడువులోగా పూర్తి చేయాలని ఎంపీఓ రాంరెడ్డి అన్నారు. మంగళవారం నర్వ కాంప్లెక్స్ సమావేశంలో సర్వేకు సంబంధించిన శిక్షణలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. పాఠశాలలో తాగునీటి సదుపాయం, ఇంకుడు గుంత, కిచెన్‌గార్డెన్, పచ్చదనం, టాయిలెట్స్, హ్యాండ్‌వాష్ వంటి అంశాలను స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ (ఎస్ఎచ్ఆర్‌వీ) యాప్‌లో నమోదు చేయాలన్నారు.

దామరగిద్ద: స్వచ్ఛత ఏవం హరిత విద్యాలయ కార్యక్రమాన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో అమలు చేసి ఉన్నత స్థాయిలో గుర్తింపు పొందాలని ఎంఈఓ కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి పలు సూచనలు చేశారు.

పౌర హక్కులపై అవగాహన తప్పనిసరి



ధన్వాడ: రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మిపతిగౌడ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నాగేశ్వరి అన్నారు. ధన్వాడ, కంసాన్‌పల్లి గ్రామాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి పౌరుల హక్కులపై అవగాహన కల్పించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారటీ సంస్థ ద్వారా పేదలకు ఉచిత ఉచిత న్యాయ సలహాల కోసం 15100 నెంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యను చెప్తే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఏఈఓ సైమన్, పోలీస్ సిబ్బంది అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ధర్నాను రైతులు నమ్మరు

మద్దూరు: యూరియా సరఫరా చేయాలని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ధర్నాను రైతులు నమ్మరని పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రైతులకు యూరియా సరఫరా చేసే క్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కార్యాలయం ఎదుట ధర్నా చేయడం ఏమిటని ప్రశ్నించారు. యూరియాను కర్ణాటకకు అమ్ముకుంటున్నట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. రైతుల మేలు కోరి యూరియాను పీఏసీఎస్ ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్‌రెడ్డి, జనార్ధన్, బాబు స్వామి, రహీం, వెంకట్‌రాములుగౌడ్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్షుద్ర పూజల కలకలం



కొత్తపల్లి: మండల పరిధిలోని నిడ్జింత గ్రామ శివారులోని వాగు కత్వలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో క్షుద్ర పూజలు చేసినట్లు తెలుస్తుంది. ఘటనా స్థలంలో కుంకుమ, దారాలు, కొబ్బరికాయలు, గుమ్మడికాయ, నిమ్మకాయలు కోసి వదిలి పెట్టిన ఆనవాళ్లు ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం కొందరు యువకులు కాలకృత్యాల కోసం అటుగా వెళ్లగా క్షుద్రపూజల విషయం బయటపడింది.

నీట మునిగిన పంటల పరిశీలన



మాగనూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన పంటలను వ్యవసాయ అధికారులు మంగళవారం పరిశీలించారు. మాగనూర్ గ్రామంలో ఏఈవో పవన్‌కుమార్ క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి నట్లు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటిస్తే రైతులకు అందజేస్తామన్నారు.

తుది ఓటర్ జాబితా విడుదల

మరికల్/కొత్తపల్లి/మద్దూరు: మండలంలోని గ్రామాల వారీగా తుది ఓటర్ జాబితాను ఆయా మండలలా ఎంపీడీఓలు మంగళవారం విడుదల చేశారు. మరికల్‌లో 14 వార్డులకు గాను 8,606 మంది ఓటర్లు ఉండగా, కొత్తపల్లిలో 16వేల మంది ఓటర్లు మద్దూరులో 26,370 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

కుట్రపూరితంగానే సీబీఐ విచారణకు ఆదేశం



నారాయణపేటలో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకుల నిరసన



మక్తల్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. తమ అధినేతను కేసులో ఇరికించాలనే కాంగ్రెస్ కుట్రపూరితంగా సీబీఐతో విచారణ చేపట్టడానికి చర్యలు చేపట్టిందని విమర్శించారు. కాళేశ్వరం కేసులో సీబీఐ విచారణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

- నారాయణపేటలో మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ఆదేశానుసారం సత్యనారాయణ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు విజయసాగర్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీష్ రావుపై అక్రమ కేసులు పెట్టి నిర్బంధించడానికే కుట్రలు పన్నుతుందన్నారు. కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు బీఆర్ఎస్ పార్టీ బెదిరే పరిస్థితి లేదన్నారు. మాజీ కౌన్సిలర్ గురులింగప్ప, పట్టణ మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ అన్సారీ, కార్యదర్శి చెన్నారెడ్డి పాల్గొన్నారు.
- మక్తల్‌లో నల్లబ్యాడ్జిలు ధరించి బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.
- మరికల్‌లో జాతీయ రహదారిపై కూర్చొని రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తిరుపతయ్య మాట్లాడుతూ కాళేశ్వరం పేరుతో కేసీఆర్‌ను జైలుకు పంపించడానికే కుట్ర పన్నిందని ఆరోపించారు.
- కొత్తపలిలో ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు.
- కోస్గిలోని శివాజీ చౌరస్తాలో సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేయగా పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.
- ధన్వాడలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో కారణంగా రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి.